నాన్ టీచింగ్ కాంట్రాక్ట్ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి


ఎమ్మెల్సీ కోదండరాంను సన్మానిస్తున్న యూనివర్సిటీస్ కాంట్రాక్ట్ ఉద్యోగులు

లాలాపేట: తెలంగాణ రాష్ట్ర విశ్వవిద్యాలయాల నాన్ టీచింగ్ కాంట్రాక్ట్ ఉద్యోగుల జేఏసీ నాయకుల బృందం శుక్రవారం ఎమ్మెల్సీ ప్రొ.కోదండరాంను తార్నాకలోని ఆయన నివాసంలో మర్యాదపూర్వకంగా కలిసి ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా వారు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని కోదండరాంను కోరారు. జేఏసీ చైర్మెన్ సూర్యచందర్, వైస్ చైర్మెన్ అంజయ్య, అధ్యక్షుడు కట్టా వెంకటేష్, రాములు,సురేష్, సంతోష్, మెహర్ తదితరులున్నారు.

శాస్త్రీయ విజ్ఞానంపై విద్యార్థులకు అవగాహన

లాలాపేట: విజ్ఞాన దర్శిని, రెయిన్ బో హోం సంయుక్త ఆధ్వర్యంలో లాలాపేటలోని ప్రభుత్వ (ఆర్యవాటిక) ప్రాథమిక పాఠశాలలో శుక్రవారం 'సైంటిఫిక్ టెంపర్' అనే అంశంపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా విజ్ఞాన దర్శిని ప్రసిడెంట్ టి. రమేష్ ,కె వి పి ఎస్ రాష్ట్ర అధ్యక్షులు స్కైలాబ్ బాబు తదితరులు మాట్లాడుతూ ప్రజల్లో మూఢ నమ్మకాలు రూపుమాపేలా, సమాజంలో శాస్త్ర విజ్ఞానం పెంపొందించేందుకు తాము కృషి చేస్తున్నామన్నారు. మాయలు, మంత్రాలను ఎట్టి పరిస్థితుల్లోను నమ్మవద్దని, శాస్త్రీయ దృక్పథాన్ని కల్గి ఉండాలనీ విద్యార్థులకు సూచించారు. కార్యక్రమంలో స్కూల్ హెచ్ఎం మంజుల, రెయిన్ బో హోమ్స్ మేనేజర్ సమద్ పాల్గొన్నారు.


విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న దృశ్యం

బాలుడిని తల్లిదండ్రుల చెంతకు చేర్చిన పోలీసులు


బాలుడిని తల్లికి అప్పగించిన పోలీసులు

రసూల్‌పురా: పాఠశాలకు వెళ్ళేందుకు ఇష్టం లేని ఓ బాలుడు (13) ఇంట్లో నుంచి వెళ్ళిపోవడంతో పోలీసులు మూడు గంటల్లో వెతికి కుటుంబ సభ్యులకు అప్ప గించారు. తిరుమలగిరి పోలీసులు తెలిపిన మేరకు.. కాకినాడకు చెందిన ఓ కుటుంబం ఇటీవల నగరానికి చేరుకుని తిరుమలగిరి టీచర్స్ కాలనీలో నివాసం ఉంటున్నారు. స్థానికంగా ఉన్న పాఠశాలలో చదివేందుకు ఇష్టపడని బాలుడు శుక్రవారం ఉదయం ఇంట్లో నుంచి బయటికి వెళ్ళాడు. తల్లి ఫిర్యాదుతో పోలీసులు బాలుడిని సికింద్రాబాద్ రైల్వేస్టేషన్‌లో ఆచూకి కనుగొని తల్లి విజయకి అప్పగించారు. బాలుడి ఆచూకి కనుగొని అప్పగించిన ఎస్ఐ అంతోనయమ్మ, శ్యామ్‌రావులను సీఐ అభినందించారు.

సందడి చేసిన విద్యార్థినులు

సనత్‌నగర్: బేగంపేటలోని ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో సంస్కృతోత్సవాలు శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల విద్యార్థినులకు సంస్కృత శ్లోక పఠనం, వ్యాసరచన, ఉపన్యాస పోటీలు నిర్వహించారు. విద్యార్థినులు ఈ పోటీల్లో ఉత్సాహంగా పాల్గొని సత్తా చాటారు. వేడుకలకు ముఖ్యఅతిథిగా పూర్వ సంస్కృత ఆచార్యులు బీ లక్ష్మణాచార్యులు హాజరయ్యారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ కే పద్మావతి, వైస్ ప్రిన్సిపాల్ వసుధ, సంస్కృత విభాగం అధ్యక్షులు ఐఆర్ నందిని పాల్గొన్నారు.


విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేస్తున్న కళాశాల పూర్వ ఆచార్యులు లక్ష్మణాచార్యులు

దోమల నివారణపై ర్యాలీ



బన్సీలాల్‌పేట్: దోమల నివారణపై ప్రతి ఒక్కరిని అప్రమత్తం చేస్తూ ఆరోగ్యంపై ప్రజలకు అవగాహన కల్పించాలని వైద్య సిబ్బంది కోరారు. శుక్రవారం బోయిగూడలోని పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో దోమల నివారణ అవగాహన ర్యాలీని నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆరోగ్య కేంద్రం డాక్టర్ అనిల్‌కుమార్, సీతాఫల్‌మండి క్లస్టర్ సీనియర్ పబ్లిక్ హెల్త్ ఆఫీసర్ సక్కుభాయి తదితరులు మాట్లాడారు. ర్యాలీలో పెద్ద ఎత్తున ఆశవర్కర్లు, మలేరియా సిబ్బందితో పాటు మలేరియా సూపర్‌వైజర్ ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

ప్రయాణికుల దృష్టిమరల్చి చోరీలు

నలుగురు సభ్యుల ముఠా అరెస్టు

సనత్‌నగర్: రద్దీగా ఉండే రైల్వేస్టేషన్లు, బస్‌స్టేషన్లలో ప్రయాణికుల దృష్టిమరల్చి వారి బ్యాగ్‌ల్లోని విలువైన బంగారు ఆభరణాలను మాయం చేసే నలుగురు సభ్యుల ముఠాను బేగంపేట పోలీసుల సహకారంతో నార్త్‌జోన్ టాస్క్‌ఫోర్స్ పోలీసులు అరెస్టు చేశారు. వారి నుంచి రూ.8.82 లక్షల విలువైన సొత్తును స్వాధీనం చేసుకున్నారు. పోలీసులు తెలిపిన మేరకు.. ఉత్తరప్రదేశ్‌కు చెందిన ఇర్ఫాన్ (49), షకీర్ (30), అతని భార్య రూబీ, బోరబండకు చెందిన మహ్మద్ ఫిరోజ్ (38)లు ముఠాగా ఏర్పడి దృష్టిమరల్చి దొంగతనాలకు పాల్పడుతుంటారు. మహ్మద్ ఫిరోజ్ ఆటోడ్రైవర్‌గా వ్యవహరిస్తుండగా, షకీర్, అతని భార్య రూబీలు ఆ ఆటోలో ప్రయాణికులుగా వెనుక సీట్లో కూర్చొంటారు. డ్రైవర్ మహ్మద్ ఫిరోజ్ అమాయక ప్రయాణికుల వద్దకు వెళ్లి షేరింగ్ ఆటో అంటూ వారిని ఆటోలో ఎక్కించుకుంటాడు. కొద్దిదూరం ఆటో వెళ్లిన తర్వాత అప్పటికే ప్రయాణికుడిగా రోడ్డుపై వేచి ఉన్న ఇర్ఫాన్ అదే ఆటోను ఎక్కుతాడు. ఆ సమయంలో సీటు ఇరుకుగా ఉందంటూ ఒరిజినల్ ప్రయాణికుల బ్యాగ్‌ను సీటు వెనుక భాగంలో ఉంచాల్సిందిగా డ్రైవర్ మహ్మద్ ఫిరోజ్ చెబుతాడు. దీంతో వారు తమ బ్యాగ్‌లను వెనుక భాగంలో ఉంచుతారు. ఈ క్రమంలో ఆటోలో ఉన్న నిందితులు షకీర్, రూబీ, మహ్మద్ ఫిరోజ్‌లు ప్రయాణికులను మాటల్లో పెట్టగా ఇర్ఫాన్ వారి బ్యాగ్‌ల్లోని విలువైన వస్తువులను తస్కరిస్తుంటాడు. తమ పని అయిపోగానే ఆటో చెడిపోయిందని ఆటోలో ఉన్న వారందరినీ పంపించేస్తాడు. ఈ విధంగా పక్కా ప్లాన్‌తో ఈ నెల 20న బేగంపేట పోలీస్‌స్టేషన్ పరిధిలోని ప్యారడైజ్ సమీపంలో ప్రయాణికుల నుంచి పెద్ద మొత్తంలో విలువైన బంగారు నగలు, నగదును దోచుకెళ్లారు. బాధితుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకున్నారు. విశ్వసనీయ సమాచారం మేరకు నార్త్‌జోన్ టాస్క్‌పోర్స్ బృందం శుక్రవారం అరెస్టు చేసి నిందితులను బేగంపేట పోలీసులకు అప్పగించారు. వారి నుంచి ఎనిమిది తులాల బంగారు నెక్లెస్, ఒక తులం రెండు బంగారు ఉంగరాలు, ఒక తులం చెవిపోగులు, మాటిస్, ఒక తులం చైన్, వెండి కడియాలు, ఆటో, రెండు స్మార్ట్‌ఫోన్లు, రూ.2000 నగదు మొత్తం రూ.8.82 లక్షల విలువైన సొత్తును స్వాధీనం చేసుకున్నారు.


పోలీసులు స్వాధీనం చేసుకున్న నగలు, నగదు, మొబైల్ ఫోన్లు

మ్యాన్‌హోల్‌కు మరమ్మతులు..


మ్యాన్‌హోల్‌కు మరమ్మతులు చేసిన దృశ్యం..

సాక్షి ఎఫెక్ట్..

సనత్‌నగర్: 'మ్యాన్‌హోల్‌ను పట్టించుకోండి' శీర్షికన శుక్రవారం 'సాక్షి'లో ప్రచురితమైన కథనానికి జలమండలి అధికారులు స్పందించారు. సనత్‌నగర్ డివిజన్ తులసీనగర్‌లో ప్రమాదకరంగా మారిన మ్యాన్‌హోల్ పరిస్థితులపై కథనం ప్రచురించడంతో జలమండలి డీజీఎం వంశీ పర్యవేక్షణలో సిబ్బంది మరమ్మతులు చేపట్టారు.

పాదచారుల ఇబ్బందులు తొలగించడానికి జనం రద్దీ ఎక్కువ ఉండే ప్రాంతాల్లో వంతెనలు నిర్మించడం ఆనవాయితీ. కానీ సికింద్రాబాద్‌లో ఇందుకు భిన్నంగా జనంరద్దీ అసలే ఉండని ప్రాంతాల్లో అధికారులు మూడు పుట్‌ఓవర్ వంతెనలు నిర్మించారు. అధికారులు మారినపుడల్లా ప్రజల అవసరాలతో పని లేకుండా కొత్త ప్రతిపాదనలు సిద్ధం చేయడం, ఉన్న నిధులు ఖర్చు చేసి వెళ్లడం రివాజుగా మారింది. కనీస ముందుచూపు లేకుండా, పాదచారులు వినియోగించుకోని ప్రదేశాల్లో మూడు వంతెనలు నిర్మించి ప్రజాధనాన్ని తుప్పు పట్టిస్తున్న ఘనత ఇక్కడి అధికారులకే చెల్లుతుంది. ఇక్కడ ఏర్పాటు చేసిన మూడు పుట్‌ఓవర్ వంతెనల్లో మెట్రో అధికారులు నిర్మించిన వంతెన ఒకటి మొత్తంగా శిథిలావస్థకు చేరిపోయింది. జీహెచ్ఎంసీ అధునాతన వసతులతో నిర్మించిన మరో రెండు వంతెనలు తుప్పుపట్టి పోతున్నాయి. –సికింద్రాబాద్



శిథిలావస్థకు చేరిన మెట్టుగూడలోని మెట్రో వంతెన

- మూడు వంతెనలు నిరుపయోగం
- శిథిలావస్థలో ఒకటి
- తుప్పు పడుతున్న మరో రెండు
- పాదచారుల తిప్పలు యథాతథం
- లష్కర్‌లో జీహెచ్ఎంసీ, మెట్రో తీరు

సికింద్రాబాద్‌లో జీహెచ్ఎంసీ అధికారులు మూడేళ్ల క్రితం రెండు ఫుట్ ఓవర్ వంతెనలు ఏర్పాటు చేశారు. ఇందులో ఒకటి సికింద్రాబాద్ ఎస్పీ రోడ్డులోని సెయింట్ ఆన్స్ ముందుది. తార్నాక నుంచి లాలాపేట్ మార్గంలో సెయింట్ ఆన్స్ స్కూల్ ముందు వంతెన రెండవది. ఈ రెండు పుట్‌ఓవర్ వంతెనలను అధునాతన వసతులతో ఏర్పాటు చేశారు. రోడ్డుకు రెండు వైపులా పుట్‌ఓవర్ ఎక్కడానికి మెట్లతో పాటు వృద్ధులు, మహిళల కోసం లిఫ్టులు ఏర్పాటు చేశారు. ఈ రెండు వంతెనలు ఏర్పాటు చేసిన ప్రాంతాల్లో పాదచారుల సంచారం తక్కువ. ఈ రెండు మార్గాల్లో రోడ్డు దాటేవారు లేకపోవడంతో వంతెనలు నిరుపయోగంగా ఉంటున్నాయి. నిర్వహణ లేమి కారణంతో ఉన్న ఖరీదైన లిఫ్టులు ఎప్పుడో మొత్తంగా చెడిపోయాయి. దీంతో క్రమేణా రెండు వంతెనలు తుప్పుపట్టి పోతున్నాయి. ఈ రెండు వంతెనల నిర్మాణం కోసం జీహెచ్ఎంసీ అధికారులు రూ.4 కోట్లు వెచ్చించడం గమనార్హం.

శిథిలావస్థలో మెట్రో వంతెన

మెట్టుగూడ–తార్నాక రహదారిలోని రైల్వే ఆఫీసర్స్ క్లబ్ ముందు మెట్రో అధికారులు నిర్మించిన పుట్‌ఓవర్ వంతెపన మొదటి నుంచి నిరుపయోగంగా ఉంటుంది. రద్దీ ఉండక పోగా ఇక్కడ కనీసం బస్‌స్టాప్ కూడా లేదు. ఇటువంటి ప్రాంతంలో అధికారులు పుట్‌ఓవర్ వంతెన ఎందుకు నిర్మించాన్న ప్రశ్నకు ఇప్పటికీ సమాధానం లేదు. నాలుగేళ్లుగా ఎండకు ఎండి వానకు నానుతున్న ఈ వంతెన క్రమేణా శిథిలావస్థకు చేరుతుంది. రూ. కోటి వ్యయంతో నిర్మించిన వంతెన పూర్తిగా శిథిలావస్థకు చేరుతుండడం పట్ల స్థానికులు విచారం వ్యక్తం చేస్తున్నారు.

ప్రజలు కోరుతున్నారిలా....

- ఎస్పీరోడ్డు సెయింట్ ఆన్స్ స్కూల్ ముందు నిర్మించిన వంతెనకు బదులు వైఎంసీఏ కూడలి లేదా ఈశ్వరీబాయి చౌరస్తాలో నిర్మించి ఉంటే పాదచారులకు వినియోగకరంగా ఉండేది.
- తార్నాక–లాలాపేట మార్గం సెయింట్ ఆన్స్ స్కూల్ ముందు నిర్మించిన వంతెనకు బదులుగా తార్నాక–హబ్సిగూడ మార్గంలోని సుదర్శన్‌రెడ్డి స్వీట్ హౌజ్ ముందు ఏర్పాటు చేసి ఉంటే పాదచారులకు ఎంతగానో ఉపయోగపడేదని స్థానికులు చుబుతున్నారు.
- మెట్టుగూడ రైల్వే ఆఫీసర్స్ క్లబ్ ముందు మెట్రో అధికారులు పుట్‌ఓవర్ వంతెన నిర్మాణం పనులకు శ్రీకారం చుట్టినపుడే స్థానికులు అభ్యంతరం చెప్పారు. అయినా అధికారులు స్పందించలేదు. ఇదే వంతెనను ఆలుగడ్డబావి ప్రాంతంలో నిర్మించి ఉంటే ఇక్కడి అత్యధిక సంఖ్యలోని పాదచారులకు రోడ్డు దాటడం కోసం ప్రమాదకర పరిస్థితులు ఉండేవి కాదన్నది వాస్తవం.


తార్నాకలో చెడిపోయిన అధునాతన లిఫ్ట్

మా హయాంలో కాదని..

మెట్రో, జీహెచ్ఎంసీ అధికారులు బాటసారుల అవసరాలు గుర్తించకుండా వంతెనలను నిర్మించడం పట్ల స్థానికులు నిరసన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు ఇప్పుడైనా స్పందించి వంతెనలు పాత సామాన్ల జాబితాలో చేరక ముందే తొలగించాలని కోరుతున్నారు. పాదచారులకు అవసరమైన ప్రాంతాలకు బదలాయించాలని కోరుతున్నారు. ఇదిలా ఉండగా ఈ వంతెనల నిర్మాణాలు తమ హయాంలో జరుగలేదని ప్రస్తుతం వాటిని ఏమి చేసే పరిస్థితిలో లేమని, ఇప్పటికిప్పుడు బదలాయించడం సాధ్యం కాదని సికింద్రాబాద్ జీహెచ్ఎంసీ జోనల్ కార్యాలయ అధికారులు చెబుతుండడం గమనార్హం.


నిరుపయోగంగా మారిన సికింద్రాబాద్ ఎస్పీరోడ్డు వంతెన


తుప్పపడుతున్న తార్నాక వంతెన

నేడు కరెంటు సరఫరా ఉండని ప్రాంతాలు




సనత్‌నగర్: ఈఎస్ఐ, ప్రకాష్‌నగర్, కుందన్ బాగ్, సంజీవయ్యపార్కు, లోధా, ఎయిర్‌పోర్ట్ సబ్‌స్టేషన్ల పరిధిలోని విద్యుత్ ఫీడర్ లైన్ల మరమ్మతుల కారణంగా శనివారం పలు ప్రాంతాల్లో కరెంటు సరఫరా నిలిపివేయనున్నట్లు గ్రీన్‌ల్యాండ్స్ ఏడీఈ చరణ్‌సింగ్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు.

- ఉదయం 10 నుంచి 11.30 వరకు శ్యామలకుంటపార్కు, బీకేగూడ, మున్సిపల్ పార్కు, ఈఎస్ఐ వెనుక ప్రాంతం, బేగంపేట భగత్‌సింగ్‌నగర్, సీపీడబ్ల్యుటీ క్వార్టర్స్, బృందావన్‌కాలనీ, అమృత మాల్, జీఎస్‌మాల్, ఐసీఐసీఐ బ్యాంక్, జయాగార్డెన్ ప్రాంతాల్లో...
- ఉదయం 10.30 నుంచి 11 గంటల వరకు బేగంపేట కామత్‌లింగాపూర్, ప్రకాష్‌నగర్ ఎక్స్‌టెన్షన్, ప్రకాష్‌నగర్ వాటర్‌ట్యాంక్ ప్రాంతాల్లో...
- ఉదయం 11.30 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు సనత్‌నగర్ ఇండస్ట్రియల్ ఏరియా, డీ–మార్ట్ ఏరియా, టయోటా షోరూం లేన్, స్కోడా షోరూం లేన్, జెన్ టెక్నాలజీ ఏరియా, ఆంధ్రాబ్యాంక్ లేన్, ఎరుకల బస్తీ, మెజిస్టిక్ మాన్షన్, జాగృతి అపార్ట్‌మెంట్స్, ఆర్‌బీఐ ఎదురు లేన్, మెథడిస్ట్ కాలనీ, రైల్వే ట్రాక్, సెయింట్ ఫ్రాన్సిస్ కాలేజ్, రాక్ గార్డెన్ పార్కు ప్రాంతాల్లో...
- మధ్యాహ్నం 1.30 నుంచి 3 గంటల వరకు హుడాలేన్, చిరాన్‌పోర్ట్ క్లబ్, పాస్‌పోర్ట్ ఆఫీస్ ప్రాంతాల్లో...
- మధ్యాహ్నం 3 నుంచి సాయంత్రం 4.30 గంటల వరకు ప్రకాష్‌నగర్ ఎక్స్‌టెన్షన్ ఏరియా, ఆర్కా మసీదు, రిజిస్ట్రేషన్ ఆఫీసు లేన్, చీకోటి గార్డెన్‌ప్రాంతాల్లో

రాంగోపాల్‌పేట్: ఉదయం 10 నుంచి 11.30గంటల వరకు రాణిగంజ్ ఫీడర్ పరిధిలోని నల్లగుట్ట స్కూల్, పోచమ్మ దేవాలయం, మొగల్ క్యాస్టిల్ ప్రాంతాల్లో

- ఉ. 11.30 గంటల నుంచి 1గంట వరకు నాగన్నకుంట ఫీడర్ పరిధిలోని హనుమాన్ దేవాలయం, నాగన్నకుంట ప్రాంతాల్లో సరఫరా నిలిపివేస్తామన్నారు.

ఎర్రగడ్డ రైతుబజార్‌లో కూరగాయల ధరలు



సనత్‌నగర్: టమాటా కిలో రూ.17, నల్లవంకాయ 28, పాడుగు వంకాయ 28, బెండకాయ 18, పచ్చిమిర్చి 45, బజ్జీమిర్చి 60, క్యాప్సికమ్ 50, పచ్చకాకర 26, పందిరి బీర 23, క్యాబేజీ 18, క్యారెట్ 45, దొండ 18, గుండు బీన్స్ 55, గింజ చిక్కుడు 45, గోకరకాయ 23, కీర 23, దోసకాయ 15, బీట్‌రూట్ 35, ఉల్లిగడ్డ 40, ఆలుగడ్డ 37, చామగడ్డ 40, మొరంగడ్డ 40, కందగడ్డ 55, సొరకాయ 11, పొట్లకాయ 13, అరటికాయ 11, మునగకాయ 4–5, ముల్లంగి 5–6. ఈ ధరలు శనివారం ఉదయం 9 గంటల వరకు అందుబాటులో ఉంటాయి.

విషజ్వరాల నివారణకు చర్యలు తీసుకోవాలి


ఎంటమాలజీ అధికారికి వినతిపత్రం అందిస్తున్న సీపీఐ నాయకులు

సికింద్రాబాద్: నగరంలో విస్తరిస్తున్న డెంగీ, మలేరియా వంటి విషజ్వరాల నివారణకు ప్రత్యేక తక్షణ చర్యలు తీసుకోవాలని సీపీఐ సికింద్రాబాద్ కార్యదర్శి కాంపల్లి శ్రీనివాస్ కోరారు. శుక్రవారం సికింద్రాబాద్ జోనల్ ఎంటమాలజిస్ట్ విభాగం అధికారి దుర్గాప్రసాద్‌ను కలిసిన సీపీఐ నాయకులు వినతి పత్రం అందించారు. అనంతరం శ్రీనివాస్ మాట్లాడుతూ.. పేదలు నివసించే బస్తీల్లో రోగనివారణ చర్యలు అమలు కావడం లేదని చెప్పారు. రోగాలు వ్యాప్తి చెందకుండా దోమల నివారణకు బస్తీల్లో మందులు పిచికారీ చేయాలని కోరారు. కార్యక్రమంలో సీపీఐ నాయకులు కొమురెల్లి బాబు, గౌరీ నాగరాజ్, శ్రీహరి, రవికాంత్ తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ సభ్యత్వ నమోదు రెట్టింపు చేయాలి


బీజేపీ నాయకుడు కనకట్ల హరిని సన్మానిస్తున్న పార్టీ నాయకులు

సికింద్రాబాద్: సికింద్రాబాద్ నియోజకవర్గంలో సెప్టెంబర్ 1 నుంచి నిర్వహించనున్న సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పార్టీ మహంకాళి జిల్లా ప్రధాన కార్యదర్శి మేకల సారంగపాణి కోరారు. శుక్రవారం నామాలగుండులోని బీఎస్ఆర్ గార్డెన్‌లో నియోజకవర్గ బీజేపీ ప్రతినిధుల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా మేకల సారంగపాణి మాట్లాడుతూ ఈ సారి బీజేపీ సభ్యత్వ నమోదును రెట్టింపు నమోదు చేసేందుకు అన్ని శ్రేణుల పార్టీ నాయకులు కృషి చేయాలన్నారు. సమావేశంలో బీజేపీ నియోజకవర్గ కన్వీనర్ కందాడి నాగేశ్వర్ రెడ్డి పాల్గొన్నారు.

పీహెచ్‌డీ ప్రవేశాలకు నోటిఫికేషన్ ఇవ్వాలి

ఉస్మానియా యూనివర్సిటీ: పీహెచ్‌డీ ప్రవేశాలకు నోటిఫికేషన్ ఇవ్వాలని ఏఐఎస్ఎఫ్ ఓయూ కార్యదర్శి నెల్లి సత్య శుక్రవారం డిమాండ్ చేశారు. జేఆర్ఎఫ్, యూజీసీ నెట్ అర్హులకే పీహెచ్‌డీ ప్రవేశాలు అనే కొత్త నిబంధనను రద్దు చేయాలన్నారు. గతంలో రెండు పద్ధతుల్లో పీహెచ్‌డీ ప్రవేశాలు కల్పించారని వివరించారు. కేటగిరి–1లో పీహెచ్‌డీ ప్రవేశాలను జేఆర్ఎఫ్, యూజీసీ నెట్ ద్వారా కేటగిరి–2లో పీహెచ్‌డీ ప్రవేశ పరీక్షలో అర్హత సాధించిన వారికి ప్రవేశాలను కల్పించారు. కానీ ఇప్పుడు కేటగిరి–2 ప్రవేశాలను రద్దు యూజీసీ నెట్, జేఆర్ఎఫ్ అర్హత లేని విద్యార్థులను పరిశోధన విద్యాకు దూరం చేయడం దారుణమన్నారు. యూజీసీ న్యాక్ ఎ ప్లస్ గ్రేడ్ గల ఓయూ కేటగిరి–2 పీహెచ్‌డీ ప్రవేశాలు కల్పించవచ్చు అన్నారు. ఢిల్లీ జేఎన్‌యూ, హైదరాబాద్ సెంట్రల్ వర్సిటీలు కేటగిరి–2 పీహెచ్‌డీ ప్రవేశాలు కల్పిస్తున్నట్లు వివరించారు.

టైలర్ అదృశ్యం

సనత్‌నగర్: ఇంటి నుంచి బయటకు వెళ్లిన టైలర్ అదృశ్యమయ్యాడు. ఈ సంఘటన బేగంపేట పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. బేగంపేట ఎస్ఐ శ్రీరాములు తెలిపిన మేరకు.. పాటిగడ్డ ప్రాంతానికి చెందిన ఇషాక్ మహ్మద్ (35) టైలర్‌గా పనిచేస్తుంటాడు. ఈ నెల 20న రాత్రి బయటకు వెళ్ళి తిరిగి రాలేదు. కుటుంబసభ్యులుచుట్టుపక్కల ప్రాంతాల్లో గాలించినా ఫలితం లేకపోవడంతో బేగంపేట పోలీసులకు ఫిర్యాదు చేశారు.

ఆకట్టుకున్న 'చిత్రంజన్'



సనత్‌నగర్: ప్రపంచ ఫొటోగ్రఫీ దినోత్సవాన్ని పురస్కరించుకుని బేగంపేటలోని సెయింట్ ఫ్రాన్సిస్ మహిళా కళాశాల మాస్ కమ్యూనిషన్, జర్నలిజం విభాగం ఆధ్వర్యంలో 'చిత్రంజన్–2024' పేరిట శుక్రవారం నిర్వహించిన వార్షిక ఫొటోగ్రఫీ ప్రదర్శన విశేషంగా ఆకట్టుకుంది. ప్రముఖ ఫొటోగ్రాఫర్, ఫిల్మ్ మేకర్ శాంసన్ సాగర్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. హృదయం, మనస్సు అనేవి కెమెరా లెన్స్‌గా అభివర్ణించారు. భావోద్వేగాలను రేకెత్తించే శక్తి ఫొటోలకు ఉంటుందన్నారు. మారుతున్న కాలమాన పరిస్థితులకు అనుగుణంగా ఫొటోగ్రఫీలో కూడా విప్లవాత్మక మార్పులు వచ్చాయన్నారు. విద్యార్థులు గీసిన చిత్రాలను తిలకించి అభినందించారు. బహుతులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపాల్ షిర్లీ, మాస్ కమ్యూనికేషన్స్ విభాగాధిపతి వి.కుమార్, నెరాహ్, మంజరి, క్లైమెంట్, సుజాన్, షోరోన్ తదితరులు పాల్గొన్నారు.

నూతన కార్యవర్గం ఎన్నిక



బౌద్ధనగర్: పద్మశాలి సంఘం సంజీవపురం సర్వసభ్య సమావేశం శుక్రవారం బౌద్ధనగర్‌లోని సంఘం కార్యాలయంలో నిర్వహించారు. ఎన్నికల అధికారిగా డాక్టర్ చిక్కా దేవదాసు వ్యవహరించారు. ఈ సందర్భంగా సంఘం అధ్యక్షుడిగా హనుమాండ్ల బాల్‌రాజు, ప్రధాన కార్యదర్శిగా తాటికొండ చంద్రశేఖర్, కోశాధికారి ఎస్.ఎస్ చక్రధారి, ఉపాధ్యక్షులు యెలగందుల సత్యనారాయణ, నారా నవీన్‌కుమార్, సంయుక్త కార్యదర్శి వనమాల శ్రీనివాస్, చెరుపల్లి శ్రీకాంత్, కార్యవర్గ సభ్యులుగా బాస శివకుమార్, నారా నర్సింగ్ రావు, రాపోలు కుమారస్వామి, జక్క శ్రీహరిబాబు, బోగ సంజీవ్, వనం శ్రీనివాస్, సలహాదారు డాక్టర్ చిక్కా దేవదాసు, యాదగిరి, వల్లకాటి బాబురావులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు తెలిపారు.

తార్నాక డివిజన్ ఏఈగా వేణు


డిప్యూటీ మేయర్‌ను కలిసిన తార్నాక నూతన ఏఈ వేణు

లాలాపేట: తార్నాక మున్సిపల్ డివిజన్ జీహెచ్ఎంసీ అసిస్టెంట్ ఇంజనీరుగా వేణు నియమితులయ్యారు. ఈ మేరకు ఇటీవల జీహెచ్ఎంసీలో ఆయా విభాగాల్లో జరిగిన బదిలీల ప్రక్రియలో భాగంగా తార్నాక ఏఈగా ఇంతకాలం పని చేసిన వెంకటేష్ మూసీ రివర్ ఫ్రంట్ ప్రాజెక్టుకు బదిలీపై వెళ్లగా అడ్డగుట్ట ఏఈగా విధులు నిర్వహిస్తున్న వేణు తార్నాకుకు బదిలీపై వచ్చారు. ఈ సందర్భంగా శుక్రవారం జీహెచ్ఎంసీ డిప్యూటీ మేయర్ మోతే శ్రీలత శోభన్‌రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిసారు.

ఆత్మీయ వీడ్కోలు


సత్యనారాయణకు వీడ్కోలు పలుకుతున్న సహోద్యోగులు

అడ్డగుట్ట: సికింద్రాబాద్ రైల్ నిలయంలోని అకౌంట్స్ విభాగంలో సీనియర్ సెక్షన్ ఆఫీసర్‌గా విధులు నిర్వహిస్తున్న సత్యనారాయణ పదవీ విరమణ పొందుతున్న సందర్భంగా సహోద్యోగులు శుక్రవారం ఆత్మీయ వీడ్కోలు పలికారు. 1983లో రైల్వేలో ఉద్యోగం పొందిన సత్యనారాయణ వివిధ హోదాల్లో పని చేశారు. ఈ నెలాఖరున పదవీ విరమణ సందర్భంగా తోటి ఉద్యోగులు శుక్రవారం శాలువాలతో ఘనంగా సత్కరించి జ్ఞాపికలను బహూకరించారు.

ప్యారడైజ్ హోటల్ సెల్లార్‌లో అగ్ని ప్రమాదం

రాంగోపాల్‌పేట్: సికింద్రాబాద్ ప్యారడైజ్ హోటల్‌లోని సెల్లార్‌లో స్వల్ప అగ్ని ప్రమాదం జరిగింది. సకాలంలో మంటలను అదుపు చేయడంతో పెద్ద ప్రమాదం తప్పింది. ప్యారడైజ్ హోటల్‌లోని సెల్లార్ నుంచి దట్టమైన పొగలు రావడం గమనించిన స్థానికులు అగ్నిమాపక సిబ్బందికి సమాచారం అందించారు. వెంటనే సిబ్బంది అక్కడికి చేరుకుని మంటలను అదుపులోకి తెచ్చారు. దట్టమైన పొగలు కమ్ముకోవడంతో హోటల్‌లోని సిబ్బంది ఉరుకులు, పరుగులతో బయటకు వచ్చారు. సెల్లార్‌లో ఉండే జనరేటర్ వేడెక్కడం వలన పక్కన ఉండే చెత్త అంటుకుని మంటలు చెలరేగినట్లు అగ్ని మాపక అధికారులు తెలిపారు.